www.nagaranijam.com
PRGI/RNI NO: APTEL/2013/54450

నగరనిజం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు విలేకరులు కావలెను ఆసక్తి ఉన్నవారు ఈ క్రింది నెంబర్ ఫోన్‌కి చేయగలరు : ☎8247467562
Email Id : nagaranijam@gmail.com
Website : www.nagaranijam.com

# నగరనిజం

www.nagaranijam.com అక్షరనిజం నగరనిజం తెలుగు దిన పత్రిక

NN NEWS నగరనిజం

| సంపుటి : 13 | సంచిక : 242 | ఉమ్మడి రంగారెడ్డి | సంపాదకులు : ఏలె. పురుషోత్తం | 21 శుక్రవారం, నవంబర్ 2025 | పేజీలు : 4+ | ₹ 3 |
|---|---|---|---|---|---|---|
| Volume : 13 | Issue : 242 | Rangareddy | Editor : Yela.Purushotham | 21 Friday ,November 2025 | Pages : 4 + | Price : 3/- |

Published From Rangareddy,Circulated by Hyderabad, Nalgonda, Khammam, Karimnagar, Warangal, Mahaboobnagar, Medak, Nizamabad, Adilabad

## తేమ శాతం పేరుతో రైతులను

# ఇబ్బంది పెట్టొద్దు





● మంత్రి జూపల్లి కృష్ణారావు

**కొల్లాపూర్ నవంబర్ 20 (నగరనిజం ప్రతినిధి ఎర్రం నాగేంద్రం)** ప్రభుత్వ నిబంధనల ప్రకారం 17 శాతం తేమ ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, తేమ శాతం పేరుతో రైతులను ఇబ్బంది పెట్టవద్దని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. కుడికిల్ల, నార్లాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంత్రి జూపల్లి కృష్ణారావు గురువారం ప్రారంభించారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులను మంత్రి జూపల్లి ఆదేశించారు. నిబంధనల ప్రకారం తేమ శాతం ఉంటే నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ వెంటనే కొనుగోళ్లు చేయాలని చెప్పారు. సంబంధిత అధికారులు ప్రతీ రోజు సెంటర్లను పరిశీలిస్తూ.. ..ఎక్కడ జాప్యం చేయకుండా కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి రైతుల వివరాలను ఆన్ లైన్ లో నమోదు చేయాలని, రైతుల అకౌంట్లోకి డబ్బులు జమ అయ్యేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అన్నారు. ధాన్యాన్ని విక్రయించిన వెంటనే రైతులకు రసీదు ఇవ్వాలని, ధాన్యం కొనుగోలు తర్వాత రైతులకు ఎలాంటి సంబంధం ఉండదని ఎలాంటి సమస్యలున్నా నిర్వాహకులు, అధికారులు చూసుకోవాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. రైతులందరూ తమ ధాన్యాన్ని దళారులకు కాకుండా, కొనుగోలు కేంద్రాల్లోనే క్రయవిక్రయాలు జరపాలన్నారు.



## సర్పంచ్ ఎన్నికలు జరపకపోవడం వల్ల వల్లకాడులుగా మారిన గ్రామాలు

**కరీంనగర్ నవంబర్ 20 (నగరనిజం న్యూస్ ):** సర్పంచ్ ఎన్నికలు జరపకపోవడం వల్ల గ్రామాలు వల్లకాడులుగా మారాయని బిజెపి ఎంపి ఈటల రాజేందర్ తెలిపారు. బల్బులు పెట్టే వాళ్ళు లేరని, మురికి కాలువలు సాఫ్ చేసేవారు లేరని విమర్శించారు. గురువారం ఈటల మీడియాతో మాట్లాడారు. ప్రజల అవసరాలను పట్టించుకునే నాధుడే లేడని, 15 ఫైనాన్స్ కమిషన్ నిధులు, ఫర్ క్యాపిటా నిధులు ఎన్నికలు జరగకుంటే రావు అని, అవి వస్తేనే గ్రామాల్లో అభివృద్ధి జరుగుతుందన్నారు. రెండేళ్లుగా అభివృద్ధి కుంటుపడిందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గుర్తు ఉండదని, గ్రామాల్లో ఉండి ప్రజలకు సేవ చేసి సమస్యలను పరిష్కరిస్తానని విశ్వాసం కల్పించే వారిని ఎన్నుకుంటారని తెలియజేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఎక్కువ మందిని గెలిపించడానికి బిజెపి నాయకుడిగా తన ప్రయత్నం చేస్తున్నానని, బిల్లులు రాక సర్పంచులు, ఉపసర్పంచ్లు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, బకాయిలన్నీ వెంటనే చెల్లించి పోటీ చేసే వారిలో విశ్వాసాన్ని నెలకొల్పాలని ఈటల డిమాండ్ చేశారు. మా నాయకుల మధ్య విభేదాలు ఉన్నాయనేది కొన్ని ఛానెల్స్, యూ ట్యూబ్ చానల్స్, సోషల్ మీడియా సృష్టిస్తున్నాయని మండిపడ్డారు.

## నిరుపేదలకు సీఎం సహాయనిధి భరోసానిస్తుంది

● అవినీతికి తావు లేకుండ ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవచ్చు

● టి పిసిసి ప్రధాన కార్యదర్శి మాజీ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి



**మహేశ్వరం,నవంబర్ 20 ,(నగరనిజం) :** సీఎం సహాయనిది పేద ప్రజలకు భరోసా కల్పిస్తుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బడంగ్ పేట్ మాజీ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి పేర్కొన్నారు. బాలాపూర్ వాసి పటేల్ గూడెం సందీప్ కుమార్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడి చికిత్స చేయించుకున్నాడు. ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోవడంతో గురువారం సందీప్ కుమార్ కు చెక్కును అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అప్పులు చేసి వైద్యం చేయించుకున్న పేదలకు తొందరగా పారదర్శకంగా అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆన్ లైన్ ద్వారా ఎలాంటి అవినీతికి తావు లేకుండా దరఖాస్తు చేసుకునేలా సదుపాయం కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి. మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్నాల రాజేందర్ రెడ్డి నాయకులు శ్రీశైలం శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## శబరిమలలో అయ్యప్ప స్వామిని దర్శించుకున్న తోకల శ్రీనివాస్ రెడ్డి

● కుటుంబ సమేతంగా శబరిమల క్షేత్రానికి వెళ్లిన కార్పొరేటర్ తోకల



**రాజేంద్రనగర్,నవంబర్ 20 (నగరనిజం ప్రతినిధి):** భారతీయ జనతా పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్, మైలార్ దేవ్ పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి శబరిమల క్షేత్రంలో అయ్యప్ప స్వామిని దర్శించుకున్నారు. శబరిమల ఆలయ ఆచారాల ప్రకారం 18 బంగారు మెట్లు ఎక్కి ఆలయ ఆచారాలు, తాంత్రిక నియమాలకు అనుగుణంగా కుటుంబ సమేతంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి తోపాటు కుటుంబ సభ్యులను ఆశీర్వదించిన ఆలయ అర్చకులు..... వారికి స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు. పవిత్ర కార్తీక మాసాన్ని పురస్కరించుకొని కుటుంబ సమేతంగా శబరిమల క్షేత్రానికి వెళ్లిన కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి... అయ్యప్ప స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేరళ రాష్ట్రంలోని శబరిమల క్షేత్రానికి విశిష్ట చరిత్ర ఉందని, అయ్యప్ప స్వాములు నియమనిష్టలతో కొలిచే అయ్యప్ప స్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకోవడం ఆనందంగా ఉందని కార్పొరేటర్, భారతీయ జనతా పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. అయ్యప్ప స్వామి కృప కటాక్షాలతో ప్రజలంతా చల్లగా ఉండాలని స్వామివారిని వేడుకున్నట్లు శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు.

## అర్ధరాత్రి కారణం లేకుండా రోడ్ల మీద తిరిగితే అరెస్టులు తప్పవు!




**రాజేంద్రనగర్,నవంబర్ 20 (నగరనిజం ప్రతిని ధి):** ఎలాంటి కారణం లేకుండా అర్ధరాత్రి రోడ్డు మీద తిరుగుతున్నారని ముగ్గురు యువకులను అరెస్టు చేసిన టోలీచౌకీ పోలీసులుపెట్టీ కేసులు నమోదు చేసి, యువకులకు మూడు నుండి ఏడు రోజుల వరకు రిమాండు విధింపు ఇకనుండి ఎలాంటి కారణం లేకుండా అర్ధరాత్రి రోడ్ల మీద తిరగకూడదంటూ హెచ్చరిక జారీ చేసిన టోలీచౌకీ పోలీస్ అధికారులు.

## కుత్బుల్లాపూర్ సుభాష్ నగర్ డ్రైనేజీ సమస్యకు పరిష్కారం దిశగా అడుగు



● 99 లక్షల రూపాయల నిధులు మంజూరు

**కుత్బుల్లాపూర్ నవంబర్ 20 (నగర నిజం ప్రతినిధి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సుభాష్ నగర్ డివిజన్ 130 సురారంకాలని ఓం జెండా వద్ద గల చిరకాల డ్రైనేజీ సమస్యకు పరిష్కారం లభించబోతోంది. ఈ సమస్య పరిష్కారానికి మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు గౌరవనీయులు శ్రీ ఈటెల రాజేందర్ అన్న గారు యంపి ఫండ్ నుండి రూ.99 లక్షలు శాంక్షన్ చేశారు. ఈ రోజు డివిజన్ సీనియర్ నాయకులు మారి గణేష్, బైండ్ల రాము, అంగిడి మల్లేష్, భీమరాజు, పులి బలరాం, రాచకొండ రాజు, మంద మహేష్ తదితరులు హైదరాబాద్ వాటర్ వర్క్స్ యండి శ్రీ అశోక్ రెడ్డి గారికి, యంపి గారి శాంక్షన్ లెటర్‌ను ప్రధాన కార్యాలయం ఖైరతాబాద్‌లోని యండి గారి పిఏ గారికి అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, "చిరకాలంగా కొనసాగుతున్న డ్రైనేజీ సమస్య వల్ల కాలనీ ప్రజలు, విద్యార్థులు, విధులకు వెళ్లే మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాబట్టి వెంటనే పనులు ప్రారంభించాలని కోరుతున్నాం" అన్నారు.

## నవీన్ యాదవ్ ను కలిసిన చిలుక మధుసూధన్ రెడ్డి



**ఇబ్రహీంపట్నం, నవంబర్ 20 ( నగరనిజం ) :** జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందిన నవీన్ యాదవ్ ను హైదరాబాద్ లోని అతని కార్యాలయంలో గురువారం గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పండ్ల బొకేను అందజేసి శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఉప ఎన్నికలలో పార్టీ ఆదేశాల మేరకు గెలుపు కోసం కృషి చేసినందుకు ఎమ్మెల్యే నవీన్ యాదవ్ చిలుక మధుసూదన్ రెడ్డిని అతని బృందాన్ని ఎంతో అభినందించారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గం సభ్యులు అంజయ్య, గణేష్ నాయక, రఘుపతి రెడ్డి, వెంకటేశ్వర్లు గుప్తా, నవరాజ్, పలువురు పాల్గొన్నారు.

## వలిగొండలో కోతుల బెడద తీవ్రం

● రోడ్లపై కపిలాల రాజ్యం

● ప్రజలు భయంతో వణుకు!



**వలిగొండ, యాదాద్రి భువనగిరి జిల్లా (నగర నిజం)** వలిగొండ మండలంలో కోతుల బెడద రోజురోజుకూ పెరిగిపోతూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. రోడ్లపైకి గుంపులు గుంపులుగా దూసుకొస్తున్న కోతుల వల్ల మండలంలో ఎక్కడ చూసినా భయాందోళనలు నెలకొన్నాయి. ముఖ్యంగా ప్రధాన రహదారులపై, గ్రామ వీధుల్లో కోతులే రాజ్యం సాగిస్తోంది. కోతులు కుప్పలు కుప్పలుగా తిరుగుతూ, వాహనాలపైకి ఎక్కడం, ఇంటి ముందు ఉన్న వస్తువులను లాగిపట్టడం, బ్యాంకులకు వెళ్లాలన్నా భయం హాస్పటల్ కి వెళ్ళాలన్నా భయం చిన్న పిల్లలను వెంబడించడం వంటి ఘటనలు తరుచూ జరుగుతున్నాయి. ప్రజలు బయటకు రావడానికి కూడా భయపడే పరిస్థితి ఏర్పడింది. పాఠశాలలకు వెళ్లే చిన్నారులు, రేషన్ దుకాణాలకు వచ్చే మహిళలు, వృద్ధులు భయంతో నడిచే పరిస్థితి లేదు. కోతుల మధ్యగా వెళ్లాల్సి రావడంతో అనేక మంది ప్రజలు మండలంలోని రోడ్లపై తీవ్ర అసౌకర్యం వ్యక్తం చేస్తున్నారు. "ఇక ఈ కోతుల బెడదను అరికట్టలేరా? మా భయం ఎవరికీ చెబుతాం?" అంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో మండల ప్రజలు "గ్రామపంచాయతీ అయినా, అటవీశాఖ అయినా ఎవరైనా వచ్చి కోతులను పట్టుకోవాలి. ప్రజలకి రక్షణ కల్పించాలి. ఇలా వదిలేస్తే పెద్ద ప్రమాదాలే!" అంటూ అధికారులను తప్పనిసరిగా స్పందించాలని కోరుతున్నారు. కోతులు పట్టుకునే ప్రత్యేక బృందాన్ని నియమించి సమస్యను తక్షణమే పరిష్కరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



## భగవద్గీత కంఠస్థ పోటీలలో తపోవన్ విద్యార్థుల ప్రతిభ

- విద్యార్థులను అభినందించిన ప్రిన్సిపాల్ వర్కుటి నిరంజన్ రెడ్డి



**నవంబర్ 20,మహబూబ్ నగర్ జిల్లా (నగరనిజం ప్రతినిధి)** విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన దేవరకద్ర మండల స్థాయి భగవద్గీత కంఠస్థ పోటీలు గురువారం మండల కేంద్రంలోని మండల ప్రాథమిక పాఠశాలలో నిర్వహించడం జరిగింది.ఈ పోటీలలో శిశు స్థాయిలో తపోవన్ పాఠశాలకు చెందిన అభిమన్యు రెడ్డి ప్రథమ స్థానంలో, నిత్యశ్రీ ద్వితీయ స్థానంలో,జశ్వంత్ తృతీయ స్థానంలో బహుమతి సాధించారు. మాధ్య మిక స్థాయిలో తపోవన్ పాఠశాలకు చెందిన సాయి శ్రావణి ప్రథమ స్థానంలో,రేవంత్ రెడ్డి ద్వితీయ స్థానంలో,స్నిగ్ధ తృతీయ స్థాయిలో గెలుపొందారు.ఉన్నత స్థాయిలో తపోవన్ పాఠశాలకు చెందిన సాయి వర్ష ద్వితీయ స్థానంలో,హర్షిత తృతీయ స్థానంలో గెలుపొందారు.మండల స్థాయిలో గెలుపొందిన విద్యార్థులు ఈనెల 23వ తేదీన ఆదివారం రోజు జరిగే జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించడం జరిగింది.గెలుపొందిన విద్యార్థులకు విశ్వ హిందూ పరిషత్ జిల్లా పూర్వ అధ్యక్షులు గుద్దేటి చంద్రయ్యమరియు చెన్నారెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందుకోవడం జరిగింది.గెలుపొందిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ వర్కుటి నిరంజన్ రెడ్డి అభినందించడం జరిగింది.

## అయ్యప్ప స్వామి మహా పడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**శంషాబాద్ లోని అయ్యప్ప దేవాలయం వద్ద ఘనంగా అయ్యప్ప స్వామి మహా పడిపూజ**



**రాజేంద్రనగర్,నవంబర్ 20 (నగరనిజం ప్రతినిధి):** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమంలో రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పాల్గొన్నారు.అయ్యప్ప స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.మహా పడిపూజ అనంతరం అయ్యప్ప స్వాములకు అన్న ప్రసాదం కార్యక్రమాన్ని ప్రారంభించారు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ను శంషాబాద్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్ స్వామి పూలమాలవేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ మున్సిపల్ మాజీ చైర్మన్ సుష్మ మహేందర్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్, పార్టీ సీనియర్ నేతలు ఆర్ గణేష్ గుప్తా, కొడిగంటి చంద్రారెడ్డి, నార్సింగి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దూడల వెంకటేష్ గౌడ్, సుల్తాన్ పల్లి మాజీ సర్పంచ్ దండు ఇస్తారి, నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ అనేగౌని శ్రీకాంత్ గౌడ్, మాజీ కౌన్సిలర్లు పుష్పలత బుచ్చిరెడ్డి, ఉప్పునుంతల అజయ్, ఆర్ బి నగర్ కాలనీ నేతలు నరేందర్ గౌడ్ స్వామి, బొల్లు బంటి స్వామి,గొల్లపల్లి అంజయ్య తదితర అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

# నర్కూడలో కాల్పుల కలకలం







- బెంగాల్ వాసిపై ఎయిర్ గన్ తో కాల్పులు జరిపి పారిపోయిన దుండగుడు
- ఆటో కిరాయి డబ్బుల విషయంలో గొడవ
- సమీర్ దాస్ పై కాల్పులు జరిపి పారిపోయిన గుర్తు తెలియని వ్యక్తి
- శంషాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు
- క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించిన శంషాబాద్ పోలీసులు

**రాజేంద్రనగర్,నవంబర్ 20 (నగరనిజం ప్రతినిధి):** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం లోని నర్కూడ లో బెంగాల్ యువకుడు పై కాల్పులు కలకలం రేపాయి. ఆటో కిరాయి డబ్బులు విషయంలో జరిగిన చిన్న గొడవ కారణంగా ఆటోలో ఉన్న గుర్తుతెలియని దుండగుడు ఎయిర్ గన్ తో బెంగాలీ యువకుడి పై కాల్పులు జరిపి పారిపోయాడు. కాల్పుల్లో గాయపడ్డ బెంగాల్ వాసిని పోలీసులు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. సంచలనం సృష్టించిన ఈ ఘటన శంషాబాద్ పరిధిలోని నర్కూడ లో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. శంషాబాద్ రూరల్ ఇన్స్పెక్టర్ నరేందర్ రెడ్డి కథనం ప్రకారం కాల్పుల ఘటనకు సంబంధించి వివరాలు.. ..పూర్వపురాలు ఇలా ఉన్నాయి. బెంగాల్ రాష్ట్రానికి చెందిన బాధితుడు సమీర్ దాస్ (36) 8 ఏళ్ల క్రితం బతుకుదెరువు కోసం హైదరాబాద్ నగరానికి వచ్చి హైదరాబాద్ చార్మినార్ ప్రాంతంలోని ఘాన్సీ బజార్ లో నివాసం ఉంటున్నాడు. ఈ మేరకు చార్మినార్ ప్రాంతంలో గోల్డ్ స్మిత్ వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇదిలా ఉండగా గత 7 నెలల క్రితం బాధితుడు సమీర్ దాస్ శంషాబాద్ మండలం లోని నర్కూడ వద్ద స్థలం కొనుగోలు చేసి ఇంటి నిర్మాణం చేపట్టాడు. ఈ నేపథ్యంలో ఇల్లు నిర్మాణం పనులు చూసుకోవడానికి తరచూ అతను హైదరాబాద్ నుండి నర్కూడ గ్రామానికి రాకపోకలు సాగిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో నర్కూడ లోని నిర్మాణంలో ఉన్న ఇంటికి చేరుకున్నాడు సమీర్ దాస్. అదేవిధంగా అతని అల్లుడు పింటూ హట్టి తో పాటు అతని స్నేహితులు సైతం అక్కడికి రావడం జరిగింది. వచ్చిన పది ముగించుకొని హైదరాబాద్ వెళ్లడానికి ప్రయత్నిస్తుండగా పింటూ హట్టి ద్విచక్ర వాహనం చెడిపోయింది. దీంతో ఓలా, ఉబెర్ ద్వారా ఆటో మాట్లాడుకొని వెళ్లడానికి నిశ్చయించుకున్నారు. ఇంతలో అటువైపుగా వచ్చిన ఓ ప్యాసింజర్ ఆటోను గమనించిన సమీర్ దాస్ అల్లుడుతోపాటు అతని స్నేహితులను అందులో హైదరాబాద్ పంపించడానికి డ్రైవర్ తో కిరాయి మాట్లాడాడు. అయితే ఆటో డ్రైవర్ తో కిరాయి మాట్లాడుతుండగానే అప్పటికే ఆటోలో కూర్చున్న ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తుల్లోంచి ఒకరు ఎయిర్ గన్ తీసి సమీర్ దాస్ పై కాల్పులు జరిపాడు. ఈ కాల్పుల్లో సమీర్ దాస్ కు పొట్టపై బుల్లెట్ గాయం తగిలింది. కాల్పులు జరిపిన దుండగుడు అక్కడి నుండి తప్పించుకొని పారిపోయాడు. ఈ ఘటన నర్కూడ గ్రామంలో కలకలం రేపింది. దీంతో బాధితుడు సమీర్ దాస్ శంషాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన పోలీసులు క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించారు. మరోవైపు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాల్పులు జరిపి పారిపోయిన దుండగుడి కోసం గాలిస్తున్నట్లు శంషాబాద్ సీఐ నరేందర్ రెడ్డి ప్రకటించారు.త్వరలోనే నిందితుడిని అరెస్టు చేస్తామని మీడియాకు తెలిపారు.

## భవద్గీత పోటీలలో ప్రతిభ కనబరిచిన శ్రీవాణి విద్య మందిర్ విద్యార్థులు





- విద్యార్థులను అభినందించిన శ్రీవాణి విద్యా మందిర్ యాజమాన్యం

**నవంబర్ 20,(నగరనిజం ప్రతినిధి)**నారాయణ పేట్ జిల్లా మరికల్ మండల కేంద్రంలో విశ్వహిందూ పరిషత్ మరియు బజరంగ్ దళ్ వారు నిర్వహించిన భగవత్ గీతా కంఠస్థ పోటిల్లో బహుమతులు సాధించి,జిల్లా స్థాయికి అర్హత సాధించిన విద్యార్థు లకు శ్రీవాణి పాఠశాల యాజమాన్యం పూర్ణిమ వెంకటేశ్వర్లు గారు మరియు పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీమతి వినీతమ్మ అభినందనలు తెలియజేశారు.అనంతరం కృష్ణవేణి (10వ ),మౌనిక, నరేందర్(7వ ),అక్షిత(5వ ),మహమ్మద్,నిషు(4వ), భ్రమ రాంబిక, మానస, నవ్య, సాత్విక్ రెడ్డి (2వ) మరియు రిత్వికశ్రీ (1వ తరగతి)విద్యార్థులను మరియు ఉపాధ్యా యడు రామాంజనే యులు ను సన్మానించడం జరిగింది.ఇదే స్ఫూర్తి తో జిల్లా స్థాయిలో మరోసారి ఉత్తమ ప్రదర్శన కనపరచాలి అని విద్యారులకు తెలియచేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో విద్యార్థులు మరియు పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారానికి ముందడుగు





- బండి రమేష్ పాదయాత్ర

**కుత్బుల్లాపూర్, నవంబర్ 20 (నగర నిజం ప్రతినిధి):**టి పి సి సి ఉపాధ్యక్షులు మరియు కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ గారు నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేస్తూ ప్రజలతో సన్నిహితంగా ఉంటున్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవడం తమ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు.“మీ సమస్యలు తెలియజేయండి పరిష్కార చర్యలు చేపడతాం” అంటూ మీ కోసం... బండి రమేష్ పేరుతో ప్రజల మధ్యకు వచ్చారు. ఈ రోజు గురువారం అల్లాపూర్ డివిజన్‌లోని సద్దాఫ్ నగర్, రాజీవ్ గాంధీ నగర్ ప్రాంతాలలో పాదయాత్ర నిర్వహించారు.స్థానిక నాయకులతో కలిసి నీరు, పారిశుధ్యం, విద్యుత్ సమస్యలు, వేధింపులు, గంజాయి విక్రయాల అరికట్టడం, చట్టసంరక్షణ, భూకబ్జాలు వంటి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు.బండి రమేష్ గారు మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం పలు ప్రజాసంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని, ప్రతి అర్హ కుటుంబానికి ఆ పథకాల లబ్ధి అందేలా కృషి చేస్తామన్నారు. కాలనీల్లో ప్రజల బాధలను విని, సంబంధిత అధికారులతో చర్చించి తక్షణ పరిష్కార చర్యలు తీసుకుంటానని తెలిపారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, పోలీస్ అధికారులు, ప్రభుత్వ అధికారులు, జమీర్ భాయ్, షఫీ భాయ్, లక్ష్మణ్, మోయిజ్ భాయ్, విట్టల్ రెడ్డి, బర్కతలి భాయ్, ఇలియాజ్ భాయ్, అడ్డు భాయ్, సాజన్ భాయ్, ఇస్మాయిల్ భాయ్, ఖాజా భాయ్, నజీర్ భాయ్, ముస్తఫా భాయ్, షహెన్షా భాయ్, మస్తాన్ రెడ్డి, అబ్దుల్లా భాయ్, కనకయ్యతో పాటు కాలనీవాసులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని బండి రమేష్ గారికి మద్దతు తెలిపారు.





## వికారాబాద్ జిల్లా కోర్టులో సంచలన తీర్పు

- భార్య, ఇద్దరు పిల్లల హత్య కేసులో నిందితుడికి ఉరిశిక్ష విధించిన న్యాయస్థానం
- 10,000 రూపాయల జరిమానా విధించిన కోర్టు
- జిల్లా ఎస్పీ కే నారాయణ రెడ్డి



**వికారాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 20 నగర నిజం:**వికారాబాద్ జిల్లా కోర్టు గురువారం నాడు ఒక చారిత్రక తీర్పును వెలువరించింది. 2019 సంవత్సరంలో తన భార్యతో పాటు ఇద్దరు పిల్లలను అత్యంత కిరాతకంగా హత్య చేసిన కేసులో నిందితుడైన గురు ప్రవీణ్ కుమార్‌కు మరణశిక్ష (ఉరిశిక్ష),10,000 రూపాయల జరిమానా (జరిమానా చెల్లించని పక్షంలో: అదనంగా 6 నెలల కఠిన కారాగార శిక్ష అనుభవించాలి) విధిస్తూ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ – సెషన్స్ జడ్జి డాక్టర్ సున్నం శ్రీనివాస్ రెడ్డి సంచలనాత్మక తీర్పు ఇవ్వడం జరిగింది. ఇట్టి వివరాలను జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి వెల్లడించారు.కేసు వివరాల్లోకి వెళితే, శేరిలింగంపల్లికి చెందిన గురు ప్రవీణ్ కుమార్, చాందినిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. అయితే, చాందినికి అంతకుముందే వివాహం జరిగి ఆయాన్ బాబు అనే కుమారుడు ఉన్నాడు. అయినప్పటికీ, తమ బిడ్డేనని అంగీకరించి ఈ దంపతులు వికారాబాద్‌కు మకాం మార్చారు. వారికి ఏంజెల్ అనే పాప కూడా జన్మించింది. అయితే, భార్య చాందిని మొబైల్ ఫోన్‌లో ఎక్కువగా మాట్లాడుతోందనే అనుమానం గురు ప్రవీణ్ కుమార్‌కు బలంగా ఉండేది. ఇట్టి విషయంలో చాలా సార్లు గొడవలు జరిగినాయి. అయినాను మారకపోవడం తో భార్య పైన అనుమానం పెంచుకొని ఈ అనుమానం ఎలాగైనా భార్యను చంపాలనే ఉద్దేశం తో 04.08.2019రోజు రాత్రి పిల్లలు నిద్రించిన తర్వాత కోపంతో తన భార్య చాందినిని ఇనుప రాడ్డుతో కొట్టి చంపాడు. అనంతరం, ఆయనే ఇద్దరు పిల్లలైన ఆయాన్ (బాబు) ను రాడ్డు తో కొట్టి, ఏంజెల్(పాప)ను గొంతు పిసికి దారుణంగా హత్య చేశాడు. ముగ్గురిని హత్య చేసిన తర్వాత నిందితుడు గురు ప్రవీణ్ కుమార్ తను రైలు కింద పడి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకొని రైలు పట్టాలవైపు వెళుతున్నాడు. మార్గమధ్యలో వికారాబాద్ పోలీస్ స్టేషన్ కనిపించగా, తాను చేసిన నేరాన్ని చెప్పి వెళ్దామని స్టేషన్‌కు వచ్చాడు. అక్కడ విధుల్లో ఉన్న పోలీస్ అధికారులు వెంటనే నిందితుడిని అదుపులోకి తీసుకొని, నేరం జరిగిన ప్రదేశానికి వెళ్లి పరిశీలించిన తర్వాత మొదటి ఐఓ అప్పటి టౌన్ ఇన్స్పెక్టర్ వి. శ్రీనివాస్ రావు గారు తక్షణమే క్రైమ్ నెంబర్ 247/2019, సెక్షన్ 302 ఐపీసీ క్రింద కేసు నమోదు చేశారు. అనంతరం 2వ ఐఓ అప్పటి వికారాబాద్ సబ్ డివిజన్ డీఎస్పీ పి. సీతారాం 3వ ఐఓ అప్పటి వికారాబాద్ సబ్ డివిజన్ డీఎస్పీ ఏ. సంజీవ రావు కేసును పటిష్టంగా, లోపాలు లేకుండా దర్యాప్తు పూర్తి చేశారు. దర్యాప్తు పత్రాలు, సాక్ష్యాలను కోర్టులో సమర్పించగా, వాదోపవాదాలు విన్న ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ & సెషన్స్ జడ్జి శ్రీ డాక్టర్ సున్నం శ్రీనివాస్ రెడ్డి నేరం యొక్క తీవ్రతను పరిగణనలోకి తీసుకొని నిందితుడు ప్రవీణ్ కుమార్‌కు ఉరిశిక్ష మరియి10,000 రూపాయల జరిమానా (జరిమానా చెల్లించని పక్షంలో: అదనంగా 6 నెలల కఠిన కారాగార శిక్ష అనుభవించాలి) విధిస్తూ గురువారం నాడు చారిత్రక తీర్పును ప్రకటించారు.ఈ కేసులో నిందితుడికి అత్యంత కఠినమైన శిక్ష పడేందుకు కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) పి. సుధాకర్ రెడ్డిని, ఐఓలు: అప్పటి ఇన్స్పెక్టర్ వి. శ్రీనివాస్ రావు, అప్పటి డీఎస్పీలు పి. సీతారాం, ఏ. సంజీవ రావు, ప్రస్తుత అధికారులు అయిన వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, టౌన్ ఇన్స్పెక్టర్ భీమ్ కుమార్,బ్రీఫింగ్ ఆఫీసర్ గిరన్న, కోర్ట్ డ్యూటీ ఆఫీసర్ ఎల్. నరేందర్, లైసానింగ్ ఆఫీసర్ యస్. శ్రీనివాస్ (ఎస్ఐ), ) ఇ. చంద్ర శేఖర్ (ఏఎస్ఐ) జిల్లా ఎస్పీ శ్రీ కె. నారాయణ రెడ్డి గారు ప్రత్యేకంగా అభినందించారు.

# అద్భుతంగా హెచ్ఏఎల్ ఓబీసీ సంఘం ఆవిర్భావ దినోత్సవ వేడుకలు







- ఎంపీ ఆర్. కృష్ణయ్య పాల్గొని కీలక సూచనలు
- అధ్యక్షుడు రవి ముదిరాజ్‌కి ప్రశంసల వర్షం

**ఖైరతాబాద్, నవంబర్ 20 (నగర నిజం):** హెచ్ఏఎల్ ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం 30వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఉత్సాహభరితంగా, అద్భుతమైన వాతావరణంలో హెచ్ఏఎల్ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు రవి కుమార్ ముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య ముఖ్య అతిథిగా హాజరై, హెచ్ఏఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి. రామ్మోహన్ రావుతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఓబీసీల హక్కుల కోసం బలమైన వేదికసభలో మాట్లాడుతూ ఎంపీ కృష్ణయ్య గారు, దేశంలో ఓబీసీ హక్కుల సాధనలో హెచ్ఏఎల్ సంఘం చేస్తున్న నిరంతర కృషిని అభినందించారు. ఉద్యోగుల సంక్షేమం కోసం సంఘం చేస్తున్న సేవలు ఆదర్శమని పేర్కొన్నారు."ఓబీసీ సంక్షేమానికి ఇది కేవలం సంస్థ స్థాయిలోనే కాకుండా దేశ స్థాయిలో పోరాటం కావాలి," అని ఆయన పిలుపునిచ్చారు.

### మూడు కీలక డిమాండ్లు

'క్రీమీలేయర్' నిబంధనను రద్దు చేయాలి.

బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలి.

పదోన్నతుల్లో రిజర్వేషన్ కోటాను అమలు చేయాలి.

మహాత్మా పూలే విగ్రహానికి ప్రశంసలుమహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేసిన తొలి పీఎస్‌యూగా హెచ్ఏఎల్ అవియానిక్స్ విభాగం నిలిచిందని కృష్ణయ్య గారు ప్రశంసించారు. ఇది ఓబీసీల గౌరవానికి ప్రతీక అని అన్నారు.

### సంఘీభావంతో నిండిన వేడుక

ఈ వేడుకలో తెలంగాణ రాష్ట్ర ఓబీసీ ఉద్యోగుల ఫెడరేషన్ అధ్యక్షుడు దాన కర్ణచారి, ఏఐఓబీసీ ఉపాధ్యక్షుడు యు. చిన్నయ్య ముదిరాజ్, యూనియన్ అధ్యక్షుడు వెంకటాద్రి, సలహాదారులు రామచంద్రయ్య, జయేందర్ గౌడ్,అలాగే హెచ్ఏఎల్ ఎస్సీ, ఎస్టీ సంఘాల అధ్యక్షులు రమేష్ బాబు, చుడమణ్, ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రకుమార్, ప్రధాన కార్యదర్శి మధుసూదన్ పాల్గొని సంఘీభావాన్ని తెలిపారు.

### సమిష్టి కృషికి కితాబులు

30 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో ఓబీసీ ఉద్యోగుల హక్కుల కోసం నిలబడి పోరాడిన సంఘం అధ్యక్షుడు రవి కుమార్ ముదిరాజ్ నాయకత్వాన్ని అందరూ ప్రశంసలతో ముంచెత్తారు. కార్యక్రమం ముగింపు సమయంలో సాంస్కృతిక ప్రదర్శనలు, సత్కారాలు వేదికను మరింత చైతన్యవంతంగా మార్చాయి.

## స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, పార్టీ శ్రేణులను ఏకతాటిపైకి రావాలి

- పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేసిన కేంద్ర మంత్రివర్యులు ప్రహ్లాద్ జోషీ






**నల్లగొండ నవంబర్ 20 (నగరనిజం న్యూస్ ):** స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, పార్టీ శ్రేణులను ఏకతాటిపైకి తీసుకురావడానికి నల్గొండ జిల్లా బీజేపీ కార్యాలయంలో ఒక ముఖ్య సమావేశం జరిగింది.ఈ సమావేశానికి కేంద్ర మంత్రివర్యులు ప్రహ్లాద్ జోషీ ముఖ్య అతిథిగా హాజరై, రాబోయే ఎన్నికల సందర్భంలో పార్టీ సిద్ధత, బూత్ మేనేజ్‌మెంట్, ప్రజల అనుసంధానం వంటి అంశాలపై కీలక సూచనలు చేశారు.ఈసమావేశంలో జిల్లా ఎన్నికల ప్రభారి, మాజీ ఎంపీ, రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ పాల్గొని, జిల్లా స్థాయి పార్టీ బలోపేతంపై, గ్రామం నుంచి బూత్ వరకు అమలు చేయాల్సిన కార్యాచరణ ప్రణాళికపై స్పష్టమైన దిశానిర్దేశం అందించారు.ఈ సమావేశానికి జిల్లా ప్రధాన నాయకులు, మండల అధ్యక్షులు, బూత్ అధ్యక్షులు, కౌన్సిలర్లు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు హాజరయ్యారు.ఈ సందర్భంగా డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ వ్యూహాత్మకంగా బలంగా పోటీ చేయడం ప్రతి బూత్‌లో ఓటర్లను చేరుకునే ప్రత్యేక కార్యక్రమాల అమలుప్రజా సమస్యలను గుర్తించి పార్టీ వేదికగా పరిష్కారం కోసం చురుకైన చర్యలు గ్రామం నుండి జిల్లా వరకు పార్టీ నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయడంవంటి అంశాలపై పార్టీ శ్రేణులకు మార్గదర్శకాలు అందించారు.పార్టీ శ్రేణులంతా ఏకమై, అంకితభావంతో పనిచేస్తే రాబోయే ఎన్నికల్లో ప్రతి బూత్‌లో బీజేపీ ముందంజలో నిలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషీ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం గత 11 సంవత్సరాలుగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మరియు అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు నిష్పక్షపాతంగా, స్పష్టంగా వివరించే బాధ్యత ప్రతి కార్యకర్తదేనని పేర్కొన్నారు.సమావేశం ముగింపులో మండల మరియు బూత్ స్థాయిల్లో ప్రత్యేక సమావేశాలు, అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ. వీరేందర్ గౌడ్, జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి, కిసాన్ మోర్చా జాతీయ నాయకులు గోలి మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కడియం రామచంద్రయ్య, రాష్ట్ర నాయకులు వీరెల్లి చంద్రశేఖర్, మండల అధ్యక్షులు, బూత్ అధ్యక్షులు, ముఖ్య నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కస్తూరిబా గాంధీ మహిళా కళాశాల నిర్మాణంలో నాణ్యత లోపం ఆరోపణలు





- తక్షణ విచారణ సాగించాలని ప్రజా సంఘాల డిమాండ్.

**మెదక్ బ్యూరో : నగర నిజం:** మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కూచారం గ్రామ పరిధిలో నూతనంగా నిర్మాణం జరుగుతున్న కస్తూరిబా గాంధీ మహిళా కళాశాల భవనంలో తీవ్ర నాణ్యత లోపాలు చోటుచేసుకున్నాయని ప్రజా సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఇసుక బదు లు డస్ట్ వాడడం, సిమెంట్ ఇటుకలు నాణ్యత లేనివి ఉపయోగించడం, ఇటుకలు చిట్లిపోయే పరిస్థితిలో ఉండ టం వంటి అనేక లోపాలు ఉన్నాయని వారు మీడియాతో వెల్లడించారు. ఈ పరిస్థితుల్లో నిర్మాణం కొనసాగితే హాస్ట ల్ భవనం విద్యార్థులకు ప్రమాదకరమని ప్రజా ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. నిర్మాణ నాణ్యతపై వచ్చిన ఈ ఆరోపణల నేపథ్యంలో జిల్లా అధికారులు, క్వాలిటీ కంట్రోల్ శాఖ అధికారులు తక్షణమే విచారణ ప్రారంభించాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. అధికారులు వెంటనే స్పందించి నిర్మాణ పనులను పరిశీలించాలని వారు కోరారు.

## రైతు గోస పట్టించుకోని ప్రభుత్వం

- నష్టపోయిన రైతులకు మీరు ప్రకటించిన 10 వేలు వెంటనే ఇవ్వాలి
- ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్




**జమ్మికుంట నవంబర్ 20 (నగరనిజం న్యూస్ ):** పంటలు చేతికి వచ్చాయి కానీ కాంటాలు లేవు, మిల్లుల్లో రోజుల తరబడి ధాన్యం దింపుకోకుండా ఇబ్బంది పెడుతున్నారు. క్వింటాల్ కి 8 కేజీల తరుగు తీస్తున్నారు. ఆరుగాలం కష్టపడితే ఈ దోపిడీ ఎందీ అని రైతులు అడుగుతున్నారు. మీరు సన్న వడ్లకు ఐదువందల రూపాయల బోనస్ ఇస్తా అన్నారు.. ఇంకా అందరికీ అందలేదు ఈసారి అయినా ప్రతి రైతుకు అందించాలని కోరుతున్నాను. – రెండు లక్షల రుణమాఫీ కూడా ఇంకా పెండింగ్ లో ఉంది. – వర్షాలు పడి వరి మునిగింది, తుఫాను మట్టి పాలు చేసింది.. – నష్టపోయిన రైతులకు మీరు ప్రకటించిన 10 వేలు వెంటనే ఇవ్వాలానీ డిమాండ్ చేసారు. – పత్తి విషయంలో కూడా నాన్చకుండా కొనుగోళ్లు చేయాలి. – 7 క్వింటాల్ నిబంధన లేకుండా కొనుగోళ్లు చేయాలని కోరుతున్నాం. సీసీఐ కూడా వర్షం వల్ల నష్టపోయి ఉన్నారు కాబట్టి నిబంధనలు సడలించాలి. – ఫసల్ భీమా రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో చెల్లిస్తే రైతులకు ఇబ్బంది ఉండేది కాదన్నారు.

### మెజారిటీ సీట్లు మావే

ఉమ్మడి కరీంనగర్ జిల్లాల్లో అత్యధిక వార్డు మెంబర్స్, సర్పంచులను, ఎంపీటీసీ,ఎంపీపీ, జీపీటీసీలను గెలిపించుకుంటాం. – వీరంతా ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు కలిగి ఉంటారు. వారికి ఉన్నంత అవగాహన మాకు కూడా ఉండదు. – ఎమ్మెల్యేగా గెలవాలి అంటే వీరి పాత్ర కీలకం. – ఈ సారి స్థానిక సంస్థల ఎన్నికలకు ఎక్కువ ప్రాధాన్యత ఉంది. – రెండు మున్సిపాలిటీలలో కూడా బూత్ పటిష్టం చేసుకొని గెలిపించుకుంటాం. – 107 గ్రామ పంచాయితీలలో మెజారిటీ గెలిచే సత్తా మాకే ఉంది. – ఎమ్మెల్యే ఎన్నికల్లో ఎలా కష్టపడ్డానో ఇప్పుడు కూడా అంతే కష్టపడి గెలిపించుకుంటాం. – త్వరలోనే నాయకులు కార్యకర్తలందరితో స్ట్రాటజీ మీటింగ్ పెట్టుకుంటాం. – సర్పంచ్ లను గెలిపించుకొనే భాద్యత నాది. నేను ఇక్కడికి వచ్చాక గత 20 ఏళ్లలో జెడ్పీటీసీ,ఎంపీపీ, మున్సిపల్ చైర్మన్ ఓడిపోయింది లేదు. 80 శాతం సర్పచులు మావే. ప్రతి ఎన్నికలో భారీ మెజారిటీతో గెలిపించుకు న్నామన్నారు.. హుజూరాబాద్ ప్రజలకు నా విజ్ఞప్తి మా వాళ్ళని గెలిపించి ఇవ్వండి. పనులు చేయించే జిమ్మేదార్ నాది అని హామీ ఇస్తున్న.– నేను ఎమ్మెల్యేగా గెలిచిన ఒక సవత్సరం తరువాత ఏడాదిగా ఏం చేశారు అని ధర్నా చేశారు.. – మరి ఇప్పుడు గెలిచి రెండేళ్లు అవుతుంది ఏం చేశారు.. మీ ముఖం ఎక్కడ పెట్టుకుంటారు అని అడుగుతున్న. – ప్రజలు చీకట్లో ఉండి పోయినం బిడ్డ అని ఏడుస్తున్నారు. అయిపోయింది ఏదో అయిపోయింది అప్పుడప్పుడు రా బిడ్డ అని అడుగుతున్నారు. నువ్వు రాకపోతే వెలుగు లేదని ప్రజలంటున్నారు. – నేను మీడియాను, సోషల్ మీడియాను నమ్ముకున్న వాణ్ణి కాదు. – ప్రజలను, ధర్మాన్ని, పనిని నమ్ముకున్న వాణ్ణి. – 25 ఏళ్లు ఇలానే బ్రతికిన. ఉన్నదాన్నే చెప్పుకునే తెలివి లేని వాళ్ళం. నన్ను 25 ఏళ్లు గుండెల్లో పెట్టుకున్న గడ్డ హుజూరాబాద్.ఈ ప్రజలను ఎలా మర్చిపోతా.– తట్టెడు మట్టి తీయలేదు అన్నారు కదా.. మీరు వంద స్పీడ్ తిరుగుతున్న 4 లైన్ల రోడ్లు ఎవరు వేశారు? – కంటిరెప్పపాటు కరెంటు పోకుండా ఉండే సబ్ స్టేషన్లు ఎవరు కట్టించారు, – ఎప్పుడు జలకళ ఉండేలా చెక్ డామ్ లు నిర్మించింది ఎవరు, – కమలాపూర్లో ఎడ్యుకేషన హబ్ తయారు చేసింది ఎవరు.. – ఇవన్నీ మా ప్రజలకు తెలుసు. – దొంగముఖాలకు అర్థం కావు.. అబద్ధాలు నమ్ముకొని బ్రతికే వారు.. వారికి ప్రజలే బుద్ధి చెప్తారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో పరిసరాల పరిశుభ్రతకు విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి

- ఎస్సీఆర్టీ డిప్యూటీ డైరెక్టర్ రేవతి రెడ్డి



**నాగర్ కర్నూల్ జిల్లా నవంబర్ 20 నగరనిజం ప్రతినిధి ఎర్రం నాగేంద్రం)** నాగర్ కర్నూల్ జిల్లా లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు భద్రతను కల్పిస్తూనే అన్ని పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాలని ఎక్కడా చెత్తా చెదారం కనిపించొద్దని పాఠశాల విద్యాశాఖ రాష్ట్ర విద్యా పరిశోధనా సంస్థ అదనపు సంచాలకులు జిల్లా పరిశీలకురాలు రేవతి రెడ్డి అన్నారు. గురువారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాలలో జిల్లాలోని మండల విద్యాశాఖ అధికారులు, కాంప్లెక్స్ పాఠశాల, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కేజీబీవీల ప్రత్యేక అధికారులతో పాఠశాలల పరిశుభ్రత కార్యక్రమం స్పెషల్ క్యాంపెయిన్ 5.0పై సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశానికి రేవతి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ....నాగర్ కర్నూల్ జిల్లాలోని అన్ని పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణ కమిటీలు ఏర్పాటు చేయాలని, విద్యార్థులకు మెరుగైన విద్యతోపాటు భద్రతను కల్పించాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చెత్త సేకరణ చేయాలని శుభ్రత తప్పని సరిగా పాటించాలని చెప్పారు. శిథిలావస్థకు చేరిన పాఠశాల గదులను తొలగించాలన్నారు. వంటగదులు శుభ్రంగా ఉంచాలని, వీటన్నింటిపై ఎంఈవోలు రిపోర్టు తయారు చేసి ఇవ్వలన్నారు. ఈ విషయంలో అలసత్వం వహించొద్దన్నారు. గత రెండురోజులుగా జిల్లాలో పలు పాఠశాలలో పర్యటించి గుర్తించిన సమస్యలను పరిష్కరించి నివేదికలు అందజేయాలని మండల విద్యాధికారులను ఆమె ఆదేశించారు. పాఠశాలలో ఎక్కడ విద్యార్థులకు అసౌకర్యాలు లేకుండా పచ్చదనం పరిశుభ్రత వాతావరణం కల్పించేలా ఏర్పాటుకు చేయాలని ఆమె సూచించారు. పదో తరగతి ఫలితాల్లో విద్యార్థులు 100% ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలన్నారు.డీఈవో రమేష్ కుమార్ మాట్లాడుతూ.... జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్‌కు దీటుగాతీర్చిదిద్దాలన్నారు. ప్రతి పాఠశాలల్లో పరిశుభ్రత వాతావరణం పచ్చదనంతో ఉండేలా ప్రధానోపాధ్యాయులు విధిగా కృషి చేయాలని విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు. అంతకుముందు ఆమె డీఈఓ రమేష్ కుమార్ తో కలిసి తాడూర్ నాగర్ కర్నూల్ బిజినపల్లి మండలాల్లోని ఉన్నత పాఠశాలలను తనిఖీ చేసి పాఠశాలల్లో అమలు చేస్తున్న పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమాలను పరిశీలించారు.ఉపాధ్యాయుల విద్యార్థులకు సలహాలను అందజేశారు.మధ్యాహ్నం భోజనం నాణ్యతలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో షర్ఫుద్దీన్, సీఎంవో బరుపటి వెంకటయ్య, ప్లానింగ్ కోఆర్డినేటర్ నూరుద్దీన్, కేజీబీవీల పర్యవేక్షణ అధికారిని శోభారాణి, టెస్ట్ బుక్ మేనేజర్ నరసింహులు మండలాల అధికారులు, ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.





# స్థానిక సంస్థ ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి

- రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని.



**మెదక్ బ్యూరో 20 నవంబర్ 2025:** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను సమర్ధవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని అన్నారు. గురువారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, రాష్ట్ర డి.జి.పి. శివధర్ రెడ్డి, ఇతర ఎన్నికల సంఘం అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు – కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులు, అదనపు కలెక్టర్లు, పంచాయతీ అధికారులతో సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణ, ఓటరు జాబితా అభ్యంతరాలు, పోలింగ్ కేంద్రాలు, రిజర్వేషన్ల ప్రక్రియ, శాంతిభద్రతల అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ మాట్లాడుతూ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణ ప్రశాంత వాతావరణంలో సమర్థవంతంగా నిర్వహించాలని, ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎన్నికలను 3 విడతలలో నిర్వహించేందుకు అవసరమైన కార్యచరణ రూపొందించాలని తెలిపారు. ఎన్నికల సమయంలో రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఎన్నికల ప్రవర్తన నియమావళి సమర్థవంతంగా అమలు చేయాలని, ఎన్నికల పరిశీలకులకు శిక్షణ అందించడం జరుగుతుందని, జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసే ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యుల జాబితా సమర్పించాలని తెలిపారు. 2011 ఎన్నికల జాబితా ప్రకారం షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, 2024 ఎస్ ఈ ఈ ఈ పి సి సర్వే ప్రకారం వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ జిల్లాలో గ్రామపంచాయతీలు, వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికల నిర్వహణ కొరకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. నిబంధనల ప్రకారం రిజర్వేషన్ల ప్రక్రియ చేపడతామని, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అవసరమయ్యే సిబ్బంది, ఎన్నికల సామాగ్రిని సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం జిల్లాలో ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు అదనపు ఎస్సి మహేందర్ జెడ్పి సీఈఓ ఎల్లయ్య, జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, జిల్లా రెవెన్యూ అధికారి భుజంగరావు, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు చీరలు ఇస్తే వారు "కోటీశ్వరులు" ఎట్లా అవుతారు..

- చీరలు ఇస్తే మహిళల ఉన్నతి ఎట్లా జరుగుతుంది?
- సారె అంటే రేవంత్ రెడ్డి కి అర్థం తెలుసా? సారె ఎవరు ఎవరికి, ఏ సందర్భంలో ఇస్తారు?
- సారె రూపంలో ఆడబిడ్డల తెలంగాణ సాంప్రదాయాన్ని అవమానించొద్దు
- కేవలం ఎన్నికల వేళ చీరలు ఇచ్చి మోసం చేయాలనుకోవడం దుర్మార్గం
- చీరలు పంపిణీ చేస్తున్న ఉద్దేశ్యం రాబోయే లోకల్ బాడీ ఎలక్షన్స్ కోసం మాత్రమే
- బిజెపి తెలంగాణ రాష్ట్ర మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు మేకల శిల్పారెడ్డి



హైదరాబాద్ నవంబర్ 20 (నగరనిజం న్యూస్ )బీనిన్న సీఎం రేవంత్ రెడ్డి ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా కోటి మంది మహిళలకు చీరలు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కానీ కోటి మంది మహిళలకు చీరలు ఇస్తే వారు "కోటీశ్వరులు" ఎట్లా అవుతారో మహిళలందరూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. చీరల పంపిణీ ద్వారా మహిళల ఉన్నతి, తెలంగాణ ప్రగతి జరుగుతుందని రేవంత్ రెడ్డి చెబుతున్నారు. చీరలు ఇస్తే మహిళల ఉన్నతి ఎట్లా జరుగుతుంది? దాని ద్వారా తెలంగాణ ప్రగతి ఎట్లా జరుగుతుంది? అనేది రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో బిజెపి తెలంగాణ రాష్ట్ర మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు మేకల శిల్పారెడ్డి డిమాండ్ చేసారు. గురువారం పార్టీ రాష్ట్ర కార్యాలయం లో మీడియా సమావ్వేశం లో మాట్లాడుతూ సారె రూపంలో చీరలు పెట్టాలని ఒక ఆలోచన వచ్చింది – అది మంచిదే.కానీ సారె అంటే రేవంత్ రెడ్డి కి అర్థం తెలుసా? సారె ఎవరు ఎవరికి, ఏ సందర్భంలో ఇస్తారు అనేది రేవంత్ రెడ్డికి తెలుసా?సారె అంటే ‹ బియ్యం నుంచి బంగారం వరకూ, పుట్టింటి వాళ్లు ఆడపిల్లలకు ఇచ్చే ఒక ఆభరణం. దాన్ని మీరు ఏ సందర్భంలో ఇస్తున్నారు? అనేది ముఖ్యంగా రేవంత్ రెడ్డి గారు తెలుసుకోవాలి.రేవంత్ రెడ్డికి నిజంగా మీ బానిసత్వ స్వభావాన్ని నిరూపించుకోవాలని అనిపిస్తే ‹ ఇందిరాగాంధీ జయంతి నుంచి సోనియా గాంధీ జయంతి (డిసెంబర్ 9) వరకు 21 రోజులు జపమాల వేసుకోండి. వారికి పొర్లుదండాలు పెట్టండి. కానీ సారె రూపంలో ఆడబిడ్డల తెలంగాణ సాంప్రదాయాన్ని అవమానించొద్దు.ఈ రాష్ట్రంలో కోటి 68 లక్షల మహిళలు ఉన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం కేవలం కోటి చీరలు మాత్రమే పంచుతానంటోంది. మిగతా 68 లక్షల మహిళలు ఎందుకు కనిపించడం లేదు..?సారె పెట్టాలంటే దానికి ఒక సందర్భం ఉంటుంది. మరి ఇప్పుడు ఏ పండగ ఉంది?కాంగ్రెస్ ప్రభుత్వంలోకి వచ్చిన తర్వాత ‹ రెండు దసరాలు, రెండుసార్లు దీపావళి, రెండు ఉగాదులు.. ఇలా పండుగలు వచ్చాయి. అప్పుడు గుర్తుకురాని మహిళలు.. ఇప్పుడు అకస్మాత్తుగా ఏ సందర్భంలో గుర్తొచ్చారు? ఇప్పుడు సడెన్‌గా వారి మీద ప్రేమ కురిపించి చీరలు పెట్టడం వెనుక అర్థం ఏంటి?అదికాక ‹ ఈ చీరల పంపిణీని విడతల వారీగా చేస్తున్నారు. మొదటి విడత ‹ డిసెంబర్ 9 వరకురెండో విడత ‹ మార్చిలో. మొదటి విడతలో 65 లక్షల చీరలు గ్రామీణ మహిళలకు, రెండో విడతలో 35 లక్షల చీరలు అర్బన్ మహిళలకు. ఎందుకు?ఎందుకంటే డిసెంబర్ 15న గ్రామ పంచాయతీ ఎలక్షన్ల నోటిఫికేషన్ విడుదల చేస్తారు.తర్వాత లోకల్ బాడీ ఎలక్షన్స్. అందుకే మహిళలను మోసం చేయడానికి, మహిళ ఓటు బ్యాంక్ కోసం కొత్త డ్రామా తెరపైకి తెచ్చారు.రేవంత్ రెడ్డి కొత్తగా నేర్చుకున్నది ఏమిటంటే ‹ పక్క రాష్ట్రాల ఎలక్షన్ ఫలితాలు. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్ ‹ ఎక్కడైతే మోదీ "లఖ్ పతి దీదీ" వంటి స్కీమ్స్ వల్ల మహిళలకు ప్రయోజనం జరిగిందో అక్కడ మహిళల ఓటు బ్యాంకు ఎలా పెరిగిందో చూసి%ఔ% "తమకెందుకు ఇదే ఆలోచన రావద్దు?" అని అనుకున్నారు.మహిళలు..భవిష్యత్తులో వాళ్ళ కాళ్ల మీద నిలబడేలా సంక్షేమ కార్యక్రమాలు చేస్తే బాగుంటుంది. కాని కేవలం ఎన్నికల వేళ చీరలు ఇచ్చి మోసం చేయాలనుకోవడం దుర్మార్గం.కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలన్నింటిని ఇప్పుడు తుడిచేసుకోవాలని చూస్తున్నారు. అధికారపీఠంలోకి వచ్చేముందు మహిళలకు ఇచ్చిన వాగ్దానాలు ఎందుకు అమలు చేయడం లేదు?మహిళలు గుర్తు చేసుకోవలసిన విషయం: కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు చీరలు పంపిణీ చేస్తున్న ఉద్దేశ్యం రాబోయే లోకల్ బాడీ ఎలక్షన్స్ కోసం మాత్రమే. కేంద్ర ప్రభుత్వం మహిళా సమృద్ధి యోజన కింద ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్ క్రియేట్ చేసుకుని, వాళ్లకు ట్రైనింగ్ సెషన్స్ ఇచ్చి, మైక్రో క్రెడిట్స్ అందించే విధంగా ఆదుకుంటోంది.అలాగే, నాబార్డ్, బ్యాంక్ లింకేజ్ ద్వారా క్రెడిట్స్ అందించడం కూడా ఈ పథకాల కింద జరుగు తుంది .కేంద్ర ప్రభుత్వం ఈ స్కీమ్స్ ను మన రాష్ట్రంలోని సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్ కి ఇచ్చినా, రాష్ట్ర ప్రభుత్వం అవి మహిళలకు అందించకుండా కేవలం ఓటు బ్యాంక్‌గా మాత్రమే చూస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మహిళలను ఏవైతే చీరల ద్వారా మోసం చేయాలనుకుంటుందో.., మహిళలు ఆ చీరలనే కట్టుకొని కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేస్తారు.అభయహస్తం అంటూ కాంగ్రెస్ పార్టీ చూపుతున్నదాన్ని, మహిళలే భస్మాసుర హస్తంగా మార్చి తగిన బుద్ధిచెబుతారని హెచ్చరించారు.

# "ప్రసవంలో మహిళ మృతి" సంచలన.కేసు.తిరిగివిచారణ...




- ఏడాదిన్నర తర్వాత బాధిత కుటుంబాలకు న్యాయం దక్కేనా?
- ఉమ్మడి మెదక్ జిల్లా సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లా లో చాలా ఘటనలు..
- మెదక్ జిల్లాలో తూప్రాన్, మెదక్, రామాయపేట, నర్సాపూర్ లో చాలా ఘటనలు జరుగు తున్నాయన్న ప్రజాసంఘాలు.

**మెదక్ బ్యూరో: నగర నిజం: జిల్లా ప్రతినిధి నవంబర్ 20:** రామాయంపేట పట్టణంలోని సాయి కృష్ణ ఆసుపత్రిలో ఏడాదిన్నర క్రితం జరిగిన "ప్రసవంలో మహిళ మృతి" సంచలన కేసుపై తిరిగి విచారణ ప్రారంభమైనట్లు తెలుస్తోంది. ఈ విషయంపై జిల్లా వైద్య అధికారుల బృందం జిల్లా వైద్య శాఖ కార్యాలయంలో విచారణకు హాజరవ్వాలని ఆసుపత్రి యాజమాన్యానికి నోటీసులు అందించినట్లు సమాచారం.

## అప్పట్లో చర్చనీయాంశమైన ప్రసవంలో మహిళ మృతి

గత సంవత్సరం (2024) మే నెలలో సాయి కృష్ణ ఆసుపత్రిలో ఎస్తేర్ అనే మహిళ ప్రసవం సందర్భంగా మరణించిన ఘటన అప్పట్లో స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనపై ' వచ్చిన కథనానికి స్పందించిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, తక్షణమే విచారణ చేపట్టాలని జిల్లా వైద్యాధికారులను ఆదేశించారు.

## పాత విచారణలో డాక్టర్ తప్పిదం స్పష్టం

జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డి ఎం హెచ్ ఓ) శ్రీరామ్ నేతృత్వంలో జిల్లా వైద్య బృందం వెంటనే రంగంలోకి దిగి క్షుణ్ణంగా విచారణ జరిపింది. ప్రతి విషయాన్ని కెమెరాలో రికార్డు చేస్తూ జరిపిన విచారణ అనంతరం, డీఎంహెచ్ఓ శ్రీరామ్ విలేకరులతో మాట్లాడుతూ కీలక విషయాలు వెల్లడించారు. "ప్రసవ సమయంలో అధిక మోతాదులో మందులు ఇవ్వడం వల్లే అధిక రక్తస్రావం జరిగి ఎస్తేర్ మృతి చెందారని, ఈ ఘటనలో సాయి కృష్ణ హాస్పిటల్ డాక్టర్ తప్పిదం స్పష్టంగా ఉందని ఆయన అప్పట్లో నిర్ధారించారు. పూర్తి విచారణ నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పిస్తామని జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ తెలిపారు.అయితే, ఆ విచారణ జరిగి ఏడాదిన్నర కాలం గడిచినా, బాధితురాలి కుటుంబానికి న్యాయం లభించకపోవడం గమనార్హం. న్యాయం కోసం వారు ఇంకా ఎదురుచూస్తూనే ఉన్నారు.

## తిరిగి నోటీసులు... ఏం జరగబోతోంది?

ఈ నేపథ్యంలో, గురువారం నాడు జిల్లా వైద్య అధికారుల బృందం సాయి కృష్ణ ఆసుపత్రి యాజమాన్యానికి, జిల్లా వైద్య శాఖ కార్యాలయంలో విచారణకు హాజరవ్వాలని నోటీసులు జారీ చేసినట్లుగా తెలుస్తోంది.ఈ తాజా విచారణతోనైనా కేసు కొలిక్కి వచ్చి, బాధితుల కుటుంబానికి న్యాయం జరుగుతుందా లేదా అన్నది చూడాలి. ఈ విషయంపై జిల్లా వైద్య అధికారి వివరణ కోసం ప్రయత్నించగా, ఆయన ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు. తాజా విచారణలో వెలువడే విషయాలు ఈ కేసులో కీలక మలుపు తీసుకునే అవకాశం ఉంది.

# స్వర్ణభారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనాల మెకానిక్ కోర్సు శిక్షణ






- దరఖాస్తుల కోసం ఆహ్వానించిన స్వర్ణ భారత్ ట్రస్ట్
- నవంబర్ 24 నుండి మొదలుకానున్న శిక్షణా తరగతులు

**రాజేంద్రనగర్,నవంబర్ 20 (నగరనిజం ప్రతినిధి):** స్వర్ణ భారత్ ట్రస్ట్ హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనాల మెకానిక్ కోర్సుల శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రస్తుత ప్రతినిధి గోపీచంద్ సూచించారు. ఈ మేరకు గురువారంనాడు ఆయన ఒక పత్రికా ప్రకటనను విడుదల చేశారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం లోని ముచ్చింతల్ స్వర్ణ భారత్ ట్రస్ట్ హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో నిరుద్యోగులైన యువతకు ద్విచక్ర వాహనాల మెయింటెనెన్స్ తో పాటు రిపేరింగ్ లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇందుకోసం ఆసక్తి గల అభ్యర్థులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని గోపీచంద్ సూచించారు. అటల్ జి వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రం, స్వర్ణ భారత్ ట్రస్ట్, జేకే ఫెన్నర్ మరియు హీరో మోటో కార్ప్ ఆధ్వర్యంలో ద్విచక్ర వాహన మెయింటెనెన్స్ మరియు రిపేరింగ్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు.64 రోజులపాటు ఉచితంగా ఈ శిక్షణ ఇవ్వడం జరుగుతుందని గోపీచంద్ వివరించారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేయడంతో పాటు హీరో మోటో కార్ప్ సర్వీస్ సెంటర్స్ లో ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందని ఆయన వివరించారు. అభ్యర్థులకు శిక్షణ కాలంలో ఉచిత భోజన సదుపాయంతో పాటు వసతి కల్పించడం జరుగుతుందన్నారు.ఈ కోర్సుల్లో శిక్షణ పొందడానికి 10వ తరగతి నుండి ఇంటర్, డిగ్రీ, ఐటిఐ డిప్లొమా లో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని ప్రకటించారు.అభ్యర్థుల వయోపరిమితి 19 – 35 ఏళ్ల లోపు వారు ఉండాలన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు వెంటనే తమ విద్యార్హత సర్టిఫికెట్లతో పాటు ఆధార్ కార్డ్ సర్టిఫికెట్లకు సంబంధించి రెండు జతల జిరాక్స్ కాపీలతో పాటు 3 పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు జత చేయాల్సి ఉంటుందని గోపీచంద్ తెలిపారు. దరఖాస్తు చేసుకునే ఆసక్తిగల అభ్యర్థులు వెంటనే ముచ్చింతల్ లోని స్వర్ణ భారత్ ట్రస్ట్ లో 9963277544 నెంబర్ కు ఫోన్ చేసి సంప్రదించాలని ఆయన సూచించారు.

## గోనె కాపు రెడ్డి సంఘం అధ్యక్షునికి ఆత్మీయ సన్మానం



**రాయికల్ నవంబర్ 20 (నగర నిజం)** జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలో గోనె కాపు సంఘం నూతన అధ్యక్షులుగా ఎన్నికైనా కుంభాల శ్రీనివాస్ రెడ్డిని పీఆర్టీయు టీఎస్ రాయికల్ మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు.పూల దండ వేసి సాల్వలతో సన్మానించి.. భవిష్యత్ లో మరిన్ని పదవులు పొందాలని అకాంక్షించారు.పీఆర్టీయు టిఎస్ జిల్లా అధ్యక్షులు బోయినిపెల్లి ఆనంద్ రావు, ప్రధాన కార్యదర్శి యాల్ల అమర్నాథ్ రెడ్డి,సోషల్ పోరం అధ్యక్షులు త్రిలోచనరెడ్డి, మండల శాఖ అధ్యక్షులు అంతడుపుల గంగారాజం, ప్రధాన కార్యదర్శి రాపర్తి నర్సయ్య,రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఏవిఎన్ రాజు, పొన్నం రమేష్,గాజంగి రాజేశం, దాసరి రామస్వామీ, లక్కడి రాజారెడ్డి,జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కన్నవేణి మల్లారెడ్డి, దొంతి సతీష్,బాపు రావు, ఊసకోలా రాము, మహేష్, సురేందర్ లు పాల్గొన్నారు.

Edited & printed and owner,publisher Yela purushotham,(Regd): H-No 11-21-890,Ntr Nagar,L.B nagar saroor nagar mandal,Rangareddy-Dist,500074, printed Y.p.s publication H-No 11-21-890,Ntr Nagar,L.B nagar, saroor nagar mandal,Rangareddy-Dist,TELANGANA-500074, Editor Yela purushotham.(H.O) : plot no:31,H-No 1-13,kuntloor road,Near hayathanagar,abdullapur mettu mandal,rangareddy dist,TELANGANA-501505,
RNI NO: APTEL/2013/54450.(PRGI) .PH NO:8247467562 Email; nagaranijam@gmail.com.Whatsapp no : 8247467562,WEBSITE: WWW.NAGARANIJAM.COM.TELANGANA STATE